సాక్షి
కాకినాడ
శనివారం । 18 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

సత్యదీక్షలు ప్రారంభం



సత్యదేవుని సన్నిధిలో దీక్ష చేపట్టిన భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదీక్షలు **శుక్రవారం** ఘనంగా ప్రారంభమయ్యాయి. **సత్యదేవుని** జన్మనక్షత్రం మఖను పురస్కరించుకుని వందలాదిగా భక్తులు ఈ దీక్షలు చేపట్టారు. పసుపు వస్త్రాలు ధరించి, తెల్లవారుజామున ఐదు గంటలకు ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి చేతుల మీదుగా తులసి మాలలు వేయించుకుని దీక్షలు ప్రారంభించారు. రత్నగిరిపై సత్యదేవుని ఆలయం వద్ద, కొండ దిగువన నేరేళ్లమ్మ, వినాయకుని ఆలయాల వద్ద సుమారు 400 మందితో పాటు జగ్గంపేట, అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగలలోని పవనగిరి స్వామీజీ ఆధ్వర్యాన మరో 400 మంది ఈ దీక్షలు స్వీకరించారు. తెలంగాణలోని నల్గొండ, ఖమ్మం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు కూడా దీక్షలు చేపట్టడం విశేషం. వీరు 27 రోజుల అనంతరం నవంబర్ 13న సత్యదేవుని సన్నిధిలో దీక్ష విరమిస్తారు. సత్యదీక్షలు ప్రారంభమైన సందర్భంగా వార్షిక కల్యాణ మండపం వద్ద సత్యదేవుడు, అమ్మవారికి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. దీక్ష విరమణ జరిగే వరకూ ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఇక్కడ పూజలు చేయనున్నారు. ఇంటి వద్ద పీఠం పెట్టే అవకాశం లేని స్వాములు వార్షిక కల్యాణ వేదిక మీద జరిగే పూజల్లో పాల్గొనవచ్చునని అధికారులు తెలిపారు.

సముద్రంలోకి 2.08 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 2,08,519 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 2,700, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల నీరు వదిలారు. భద్రాచలంలో 18, ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 10.40 అడుగుల నీటిమట్టం ఉంది.

కలం.. నిరసన గళం

- 'సాక్షి' గొంతు నొక్కే కుట్రలు సాగవు
- ప్రజాస్వామ్యంతో పరిహాసాలా?
- కూటమి సర్కారు తీరుపై నిరసన జ్వాల
- జిల్లావ్యాప్తంగా పాత్రికేయుల నిరసనలు
- ప్రజా సంఘాల సంఘీభావం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కలానికి సంకెళ్లు వేస్తారా? పోలీసు అక్రమ కేసులతో 'సాక్షి' మీడియా గొంతు నొక్కుతారా? పదేపదే పత్రిక కార్యాలయానికి వెళ్లి వేధిస్తారా? సంపాదకుడు ఆర్.ధనంజయరెడ్డి, సిబ్బందిపై కేసులు పెట్టి భయపెట్టాలనుకుంటారా? రాజకీయాలతో పత్రికలకు ముడిపెట్టే సంస్కృతి విడనాడండి. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తే జర్నలిస్టులు ఎటువంటి పోరాటాలకైనా వెనుకాడేది లేదు అంటూ జిల్లావ్యాప్తంగా పాత్రికేయులు శుక్రవారం గళమెత్తారు. ఎక్కడికక్కడ ర్యాలీలు, ధర్నాలు నిర్వహించి, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు ఒకే గొడుకు కిందకు వచ్చి.. 'సాక్షి' మీడియాపై కక్ష కట్టిన కూటమి సర్కారు.. వెంటనే తన తీరు మార్చుకోవాలని ముక్తకంఠంతో నినదించారు. ప్రభుత్వ ప్రోద్బలంతో పెడుతున్న అక్రమ కేసులను ఎత్తేయాలని, తక్షణమే వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

కాకినాడ కలెక్టరేట్ వద్ద..

ఏపీయూడబ్ల్యూజే, కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్, చిన్న పత్రికల సంఘాల సంయుక్త ఆధ్వర్యాన కాకినాడ కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డిని అక్రమంగా విచారిస్తున్న పోలీసుల ఛాయాచిత్రాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన గళం వినిపించారు. ఎడిటర్ ధనంజయరెడ్డి సహా 'సాక్షి' మీడియాపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలి.. జర్నలిస్టులు, పత్రికలపై అక్రమ కేసులు సిగ్గుసిగ్గు.. పత్రికలను రాజకీయాలతో ముడిపెట్టడం మానుకోవాలి.. వియ్ వాంట్ జస్టిస్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ధర్నా అనంతరం జర్నలిస్టులు ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు విజ్ఞాపన అందజేయాలని భావించారు. అయితే, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి.. ఇలా ఉన్నతాధికారులెవరూ అక్కడ లేకపోవడంతో కలెక్టరేట్‌లోని జాతిపిత గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం అక్కడి నుంచి కలెక్టరేట్ పరిపాలనాధికారిని కలిసి విజ్ఞాపన అందజేశారు. జర్నలిస్టుల ఆందోళనకు సీపీఐ నేత తాటిపాక మధు మద్దతు తెలిపారు.



కాకినాడ కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టులపై పెరుగుతున్న వేధింపులు

ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు నదీ ముల్లాఖాన్ దుర్రాని మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో జర్నలిస్టులపై అక్రమ కేసులు, మానసిక వేధింపులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికల స్వేచ్ఛకు భంగం కలిగించేలా ప్రభుత్వ ప్రోద్బలంతో పోలీసులు అనుసరిస్తున్న వైఖరి మారకుంటే జర్నలిస్టులు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తారని చెప్పారు.

పత్రికా స్వేచ్ఛను హరించాలనుకోవడం అవివేకం

ఏపీయూడబ్ల్యూజే సీనియర్ నేత డాక్టర్ సబ్బెళ్ల శివనారాయణరెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకగా నిలిచే పత్రికల స్వేచ్ఛను హరించాలనుకోవడం ప్రభుత్వాల అవివేకమే అవుతుందన్నారు. అణచివేతతో జర్నలిస్టులు మరింత రాటుదేలి ఉద్యమంలోకి వస్తారనే వాస్తవాన్ని ప్రభుత్వాలు గుర్తెరిగి వ్యవహరించాలని హితవు పలికారు. పత్రికల స్వేచ్ఛను హరించడమంటే ప్రజల భావప్రకటనా స్వేచ్ఛను నొక్కేయడమేనని కాకినాడ సిటీ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్ అన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు అంజిబాబు, జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మంగా వెంకట శివరామకృష్ణ, సాక్షి బ్యూరో చీఫ్ ఎల్.శ్రీనివాసరావు, సాక్షి టీవీ కరస్పాండెంట్ బొక్కినాల రాజు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు డెంకాడ మోహన్, సాయినాథ్, కొమ్మిరెడ్డి శ్రీధర్, ముమ్మిడి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం డీఎస్పీ తీరుపై నిరసన

పెద్దాపురంలో పాత్రికేయులు శాంతియుతంగా నిరసన తెలిపి, వినతిపత్రం అందజేసేందుకు వెళ్లగా.. అక్కడి డీఎస్పీ శ్రీహరిరాజు కార్యాలయం తలుపులు మూసేసుకున్నారు. పోలీసులతో కబురు పంపించినా కార్యాలయం లోపలకు జర్నలిస్టులను అనుమతించలేదు. పాతిక మంది జర్నలిస్టులు బయట వేచి ఉన్నా కనీసం మాట్లాడేందుకు కూడా అనుమతించలేదు. డీఎస్పీ తీరుపై జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. ఇది జరిగిన కొద్దిసేపటికే దొంగలను, బంగారం పట్టుకున్న విషయంపై డీఎస్పీ ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి రావాలని అక్కడి సీఐ ద్వారా కబురు పంపగా జర్నలిస్టులు ఆ సమావేశాన్ని బహిష్కరించారు.

ఏలేశ్వరం తహసీల్దార్ కార్యాలయం వద్ద పాత్రికేయులు ధర్నా చేశారు. వారికి సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, సీపీఎం, సీఐటీయూ తదితర ప్రజా సంఘాలు సంఘీభావంగా నిలిచాయి. పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి, నియోజకవర్గ కేంద్రం జగ్గంపేట తదితర ప్రాంతాల్లో కూడా జర్నలిస్టులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.



పత్రికా స్వేచ్ఛను హరించడం దుర్మార్గం



ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగం సక్రమంగా అమలు పత్రికల వల్లే సాధ్యం. పత్రికలకు ఆ స్వేచ్ఛ ఉండాలి. జర్నలిజం అంటే ప్రజాస్వామ్యంలో **జరుగుతున్న తప్పులను** వెలికితీసి, ప్రజలకు తెలియజేయాలి. **ఇదే రీతిలో** వార్తలు రాస్తున్న 'సాక్షి' **పత్రికా కార్యాలయాలకు** మూడు నాలుగు రోజులుగా **పోలీసులు వెళ్లడా**న్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోంది. **ఇది ప్రజాస్వామ్యా**నికి తీరని మచ్చ. ఈ **ధోరణి రాజ్యాంగాన్ని** బలి చేయడమే. ఈ మాట **ఎందుకంటున్నానంటే** గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ, జనసేన పార్టీలు పత్రికా స్వేచ్ఛపై నిరంతరం మాట్లాడేవారు. ఇప్పుడు అధికారంలోకి రాగానే పత్రికా స్వేచ్ఛపై దాడులు చేస్తున్నారు. ఇది మంచిది కాదు. ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేయకండి. 'సాక్షి'పై దాడులు పునరావృతమైతే అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తాం.

– తాటిపాక మధు,
సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కాకినాడ



ఏలేశ్వరంలో ధర్నా చేస్తున్న జర్నలిస్టులు, ప్రజాసంఘాల నేతలు



పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నియోజకవర్గ విలేకర్లు

వర్మను జీరో చేసేశాం

- జనసేన పిలిస్తేనే వెళ్లాలి, మాట్లాడాలన్నాం
- నువ్వేమైనా కోవర్టా అని వర్మను సీఎమ్మే అన్నారు
- సూపర్‌సిక్స్ సక్సెస్ కార్యక్రమం చేయొద్దన్నారు
- కాకినాడ ఇన్‌చార్జి మంత్రి నారాయణ వ్యాఖ్యలతో కలకలం
- తానేం జీరోను కానంటున్న వర్మ
- పిఠాపురంలో అన్నింటికీ చెడ్డ మాజీ ఎమ్మెల్యే
- వారందరూ ఒక్కటయ్యారన్న అనుమానం
- అంతర్మథనంలో టీడీపీ క్యాడర్



“పిఠాపురంలో వర్మను జీరో చేసేశాం. నాలుగు నెలల కిందట సీఎం పిలిపించమన్నారు. నువ్విక ఏ స్టేట్‌మెంట్లూ ఇవ్వొద్దు. జనసేన వాళ్లు పిలిస్తే వెళ్లాలి. మాట్లాడమంటే మాట్లాడాలి. అలా లేదు, కాదంటే పార్టీలో నిన్ను కోవర్టు అనుకోవాల్సి ఉంటుందని సీఎమ్మే అన్నారు.

– పి.నారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి



ఎవరో అంటేనో, ఎవరో చెబితేనో నేను జీరోను కాను. నేనేంటో నాకు, నియోజకవర్గంలో నా కార్యకర్తలకు తెలుసు. నన్ను ఎవరూ పిలిచి మాట్లాడలేదు. నాకేమీ చెప్పలేదు. పార్టీ కోసం నా మార్గంలో నేను వెళతాను. కార్యక్రమాలు కొనసాగిస్తుంటాను.”

– ఎస్వీఎస్ఎన్ వర్మ,
మాజీ ఎమ్మెల్యే, పిఠాపురం

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ఎవరు అవునన్నా, కాదన్నా తమ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే వర్మ పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందంగా తయారైందన్నది పిఠాపురంలోని టీడీపీ ముఖ్య నాయకులు, సీనియర్ కార్యకర్తల మాట. ఎన్నికలకు ముందు, తరువాత వర్మ రాజకీయ పరిస్థితిని బేరీజు వేసుకున్న ఎవరికైనా ఈ విషయం ఇట్టే అవగతమవుతుంది. పిఠాపురం ఎమ్మెల్యేగా పవన్ కల్యాణ్ గెలుపొందడం, ఉప ముఖ్యమంత్రి కావడంతోనే వర్మ రాజకీయం ప్రశ్నార్థకంగా మారింది. డిప్యూటీ సీఎం సోదరుడు, జనసేన నాయకుడైన నాగబాబు పిఠాపురంలో జరిగిన పార్టీ ఆవిర్భావ సభలో మాట్లాడిన మాటలే వర్మ భవిష్యత్తును తేల్చేసేవిగా స్పష్టమయ్యాయి. కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా పవన్‌కు పిఠాపురం కేటాయించినప్పుడు తొలి ఎమ్మెల్సీ పదవి నీకేనని వర్మకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు గట్టి హామీ ఇచ్చారనే విస్తృత ప్రచారం జరిగింది. ఆ తరువాత ఎమ్మెల్సీ ఊసెక్కడా రాలేదు. ఇదే విషయాన్ని వర్మ అనుచర టీడీపీ నాయకులు గుర్తు చేస్తూండటం గమనార్హం.

నారాయణ మాటల వెనుక మర్మమిదే..

ఇటీవల నెల్లూరు నగర టీడీపీ నాయకులు బహిరంగ విమర్శలు చేసిన నేపథ్యంలో మంత్రి పి.నారాయణ ఆ ప్రాంత నాయకులతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పార్టీ నుంచి స్పష్టమైన ఆదేశాలు, సూచనలు లేకుండా నాయకులు ఎవరూ ఏమీ మాట్లాడకూడదని, అలా ఎవరైనా మాట్లాడితే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరిస్తూ పిఠాపురం నియోజకవర్గం ప్రస్తావన తీసుకొచ్చారు. ఆయన మాటల్లోనే.. ''ఎన్డీఏ గవర్నమెంట్ మూడు పార్టీల కూటమితో కలిపి ఏర్పడింది. ప్రతి ఒక్కరూ చాలా చాలా జాగ్రత్తగా ఉండాలి. నేను కాకినాడ ఇన్‌చార్జి మంత్రిగా ఉన్నా. పిఠాపురంలో పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేగా గెలిచారు. అక్కడ మన పార్టీ వారికి, జనసేనకు రోజూ గొడవలే. నా పని అక్కడ గొడవలను సర్దడమే. వర్మ వెరీ ఫెరోషియస్. ఆయనకు పార్టీ టికెట్ ఇవ్వకుంటే ఒకసారి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలిచారు. స్టేట్‌మెంట్లు ఇస్తూంటే మూడు నాలుగు నెలల కిందట అతన్ని పిలిచి జీరో చేసేశాం. 'సర్, నన్ను జీరో చేసేశార'ని వర్మనే నాతో అంటూంటారు. తప్పదు. ఎన్డీఏ కలసి ఉన్నప్పుడు పిఠాపురంలో మీరేం స్టేట్‌మెంట్లు ఇవ్వవద్దన్నాం. జనసేన వాళ్లు పిలిచి డయాస్‌పై మాట్లాడమంటే మాట్లాడండి. స్టేట్‌మెంట్లు ఇవ్వమంటే ఇవ్వండి. మీరేం మాట్లాడొద్దన్నాం. సీఎం గారు వర్మను పిలవమంటే పిలిపించాను. నా ఎదుటే సర్ వర్మతో మాట్లాడారు. ఇవాళ నుంచి నువ్వు మాట్లాడొద్దు. అలా కాదు, లేదంటే నువ్వేమైనా పార్టీ కోవర్ట్‌వా అనుకోవాల్సి వస్తుంది. సూపర్‌సిక్స్ సదస్సు కూడా వర్మను చేయవద్దన్నారు. నన్ను వెళ్లి చేయమన్నారు. నేనే వెళ్లి చేసి వచ్చా..'' అని ముక్తాయించారు. ఇప్పుడు ఈ ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీనిపై టీడీపీ నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. ముఖ్యంగా వర్మ అనుచరులు ఆగ్రహోదగ్రులు అవుతున్నారు. నారాయణ మాటలను బట్టి, జరుగుతున్న పరిణామాలను బేరీజు వేసుకుంటే మన నాయకుడు జీరో అయినట్లే కదా అని ఓవైపు చెవులు కొరుక్కుంటూనే ఇప్పుడేం చేద్దామనే సమాలోచనలు చేసుకుంటున్నట్లు టీడీపీ సీనియర్ నాయకుడు ఒకరు 'సాక్షి'తో అనడం గమనార్హం. 'పిఠాపురంలో టీడీపీని క్రమంగా నిర్వీర్యం చేస్తున్నది వాస్తవం. అధిష్టానం నియోజకవర్గాన్ని వదిలేసుకున్నదనేది కూడా అంతే నిజం' అని ఆయన వాపోయారు.



బింకాలు పోతున్న వర్మ

వైరల్ అవుతున్న నారాయణ ఆడియోలోని అంశాలను తాజాగా వర్మ వద్ద మీడియా ప్రస్తావించగా తాను జీరో కానని చెప్పుకోవాల్సి వచ్చింది. తనేంటో, తన రాజకీయ పరిస్థితులు ఏంటో నియోజకవర్గ ప్రజలకు తెలుసని చెప్పుకొచ్చినప్పటికీ.. ప్రస్తుతం ఆయన పరిస్థితి అగమ్యగోచరంగానే తయారైంది. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన తొలి ఎమ్మెల్సీ అనే హామీ అటకెక్కింది. మనం ఎవరి మాటలూ వినక్కర్లేదు, పట్టించుకోవాల్సిన పని లేదన్న నాగబాబు మాటలను బట్టి నియోజకవర్గంలో జనసేనకే ప్రాధాన్యం తప్పక్కిన వారికేమీ లేదని తేలిపోయింది. అందువల్లనే అప్పటి నుంచీ ఎవరి కుంపటి వారిదన్నట్లు అయిపోయింది. జనసేన, టీడీపీ కార్యక్రమాలు వేర్వేరుగానే కొనసాగుతున్నాయి. వర్మను రానీయవద్దని జనసేన నాయకులు బాహాటంగానే అంటున్నది తెలియనిదేమీ కాదు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ఎవరైనా అధికారులు పిలిస్తే సరి! లేదంటే జనసేన నుంచి వర్మకు పిలుపు ఉండటం లేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, పీఏసీఎస్‌లు, ఆలయ కమిటీలు, కార్పొరేషన్ల వంటి వాటిల్లో వర్మ అనుయాయులకు పదవులు దక్కిన దాఖలాల్లేవు.

వారంతా ఒక్కటయ్యారా!

ఏదో సినిమాలో.. మీది తెనాలే, మాది తెనాలే అన్నట్లు.. జనసేన ముఖ్య నాయకులు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ ఒక్కటైపోయారా అనే అనుమానాలను సైతం టీడీపీ సీనియర్లు వ్యక్తం చేస్తున్నారు. లేదంటే నెల్లూరు నాయకులతో జరిగిన కాన్ఫరెన్స్‌లో 'వర్మ జీరో అయ్యారు. జీరోను చేసేశాం' అని టీడీపీకి చెందిన మంత్రి అనడమేమిటని సందేహిస్తున్నారు. పైగా తమ పార్టీ అధినేత చంద్రబాబు 'నిన్ను కోవర్టు అనుకోవాలా?' అని వర్మనుద్దేశించి ఎందుకంటారనే చర్చలు టీడీపీలో అంతర్గతంగా జరుగుతూండటం పరిశీలనాంశం.

నష్ట నివారణలో నేతలు

నారాయణ వాఖ్యలు పిఠాపురం టీడీపీలో తీవ్ర దుమారం లేపడంతో నేతలు నష్టనివారణ చర్యలకు దిగారు. అధిష్టానం తలంటడంతో వర్మను నారాయణ విశాఖకు పిలిపించుకుని మాట్లాడారు. వర్మనుద్దేశించి తానలా అనలేదని, ఆ ఆడియో కట్ అండ్ పేస్ట్‌లా ఉందని నారాయణ వివరణ ఇచ్చుకోగా, తాను ఇలాంటి వాటిని పట్టించుకోనని వర్మ అభిప్రాయడ్డారు.

క్లుప్తంగా

సాంబార్‌లో పడిన వ్యక్తి మృతి


సునీల్‌కుమార్ (ఫైల్)

కాకినాడ క్రైం: ఓ వివాహ వేడుకకు వెళ్లి ప్రమాదవశాత్తూ సాంబార్‌లో పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ వివరాల్లోకి వెళితే.. భీమవరం గునిపూడి ప్రాంతం అంబేడ్కర్ కాలనీకి చెందిన కటికల సునీల్‌కుమార్ (27) ఈ నెల 12న అదే ప్రాంతంలో జరిగిన ఓ వివాహ వేడుకకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ భోజనాలకు సిద్ధం చేసిన భారీ సాంబార్ బాణీలో పడిపోయాడు. అప్పుడే వండిన సాంబార్ వేడిగా ఉండడంతో దేహం కాలిపోయి తీవ్రగాయాల పాలయ్యాడు. సునీల్ కుమార్‌ను అక్కడి వారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. నాలుగు రోజులుగా బర్న్స్ వార్డులో చికిత్స కొనసాగుతుండగా అతను శుక్రవారం మధ్యాహ్నం ప్రాణాలు కోల్పోయాడు. సునీల్ కుమార్ నాలుగేళ్ల క్రితం తాను నివసిస్తున్న ప్రాంతానికే చెందిన నీలమను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు మూడేళ్ల కుమారుడు షాలేం రాజు ఉన్నాడు. కూలి పనులు చేసుకుంటూ భార్య, కుమారుడిని పోషించుకుంటున్న సునీల్ కుమార్ ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

వ్యక్తి దుర్మరణం

శంఖవరం: కత్తిపూడి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అన్నవరం పోలీసుల కథనం ప్రకారం.. సీతంపేట గ్రామానికి చెందిన బోద రాంబాబు (65) కత్తిపూడిలో ఆసుపత్రికి వచ్చాడు. అక్కడ పెట్రోల్ బంక్ వద్ద హైవే దాటుతుండగా, తుని నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.హరిబాబు తెలిపారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు ఇద్దరు విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): క్వాంటమ్ ఏజ్ బిగిన్స్ పొటెన్షియల్స్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ ఈ వివరాలు తెలిపారు. మొత్తం 38 మంది విద్యార్థులు, 19 మంది ఉపాధ్యాయులు జిల్లా స్థాయి సెమినార్‌లో పాల్గొన్నారన్నారు. వీరిలో పి.కార్తికేయ వరప్రసాద్‌రెడ్డి (కుతుకులూరు జెడ్పీ హైస్కూల్), వీఎస్ఎస్ విఘ్నేష్ (ఉండ్రాజవరం జెడ్పీ హైస్కూల్) రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారని వివరించారు. వీరు ఈ నెల 18న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సెమినార్‌లో పాల్గొంటారన్నారు. విజేతలను జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు, సీఎంఓ శ్రీనివాసరావు, ఇతర విద్యాశాఖాధికారులు అభినందించారు.

అంతా చూసి.. ఆరా తీసి

- రాయవరంలో బాణసంచా పేలుడుపై పరిశీలన
- ఘటనా స్థలాన్ని సందర్శించిన ద్విసభ్య కమిటీ
- బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు డిమాండ్


సంఘటనా స్థలంలో విచారణ చేస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యులు

రాయవరం: కోనసీమ జిల్లాను కుదిపేసిన రాయవరం బాణసంచా పేలుడు ఘటనపై ద్విసభ్య కమిటీ సభ్యులు ఆరా తీశారు.. ఘటనా స్థలాన్ని సందర్శించి, నిబంధనల అమలును పరిశీలించారు.. ఈ నెల 8న రాయవరంలోని గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో బాణసంచా ప్రమాదం జరగ్గా, ఆ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ద్విసభ్య కమిటీ సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఇందులో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్, ఈగల్ ఐజీ పీడీ రామకృష్ణలు ఉన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల, ఎస్పీ రాహుల్ మీనా, ఆర్డీఓ అఖిల, డీఎస్పీ బి.రఘువీర్‌లు ద్విసభ్య కమిటీకి ప్రమాదం జరిగిన తీరును వివరించారు. అక్కడ పరిశీలించిన సభ్యులు బాణసంచా యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి (సత్తిబాబు) చిన్న కుమారుడు చిట్టిబాబును కూడా విచారణ చేశారు. ప్రమాదం జరిగిన గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ సమీపంలోని భవానీ గ్రాండ్ ఫైర్ వర్క్స్‌ను చూసిన ద్విసభ్య కమిటీ అక్కడ తీసుకున్న భద్రతా చర్యలను పరిశీలించింది. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని, ప్రమాద ఘటనపై జిల్లా అధికారులతో సమీక్షించింది.

ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి

ఎంపీడీఓ కార్యాలయం వద్ద ద్విసభ్య కమిటీని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కలిశారు. ప్రమాదంలో మృతి చెందిన యజమానిని మినహాయిస్తే, చనిపోయిన తొమ్మిది మంది కూలీలు నిరు పేదలేనని కమిటీ దృష్టికి తీసుకు వెళ్లారు. వారివి రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలని, ఘటన జరిగి పది రోజులవుతున్నా నేటికీ ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందలేదన్నారు. పేద కుటుంబాలకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన రోజు రాష్ట్ర మంత్రులు సందర్శించినా, నేటికీ సాయం అందలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడాలని అన్నారు. ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన కూలీలకు కనీస న్యాయం చేయని ప్రభుత్వాన్ని ఏమనాలో అర్థం కావడం లేదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విశాఖపట్నం జిల్లా పరవాడ ఫార్మా కంపెనీలో ప్రమాదం జరిగినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్పందించిన తీరును ఎమ్మెల్సీ ఉదాహరించారు. ప్రమాదం జరిగిన వెంటనే 24 గంటలు తిరక్కుండానే ఒక్కో బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం అందించిన ఘనత గత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఎమ్మెల్సీ వెంట సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సిరిపురపు శ్రీనివాసరావు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వెలగల సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.


బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ద్విసభ్య కమిటీకి వివరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


న్యాయం చేయాలని నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

న్యాయం చేయాలంటూ..

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ ప్రజా సంఘాల నేతలు నినాదాలు చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్దకు మృతుల కుటుంబాలకు చెందిన బంధువులు, ప్రజా సంఘాలు వచ్చి ఆందోళన చేశారు. కమిషనర్ బయటకు రావాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. రాయవరం సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత ధూళి జయరాజు, రైతు కూలీ సంఘ నేత వెంటపల్లి భీమశంకరం, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకుడు కోన లాజర్ తదితరులు బాధిత కుటుంబాల తరఫున ద్విసభ్య కమిటీ సభ్యులకు వినతిపత్రం అందజేశారు. ఇదిలా ఉంటే బాధిత కుటుంబాలను ఆదుకోవాలని మండపేట వేగుళ్ల జోగేశ్వరరావు కమిటీ సభ్యులకు వినతిపత్రం అందించారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం..

ప్రమాదం ఏ విధంగా జరిగిందీ.. బాధిత కుటుంబాల పరిస్థితి.. వారిని ఏ విధంగా ఆదుకోవాలనే అంశాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని ద్విసభ్య కమిటీ సభ్యుడు ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ బాణసంచా తయారీ కేంద్రానికి అన్ని అనుమతులు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. పోలీస్, రెవెన్యూ, ఫైర్, కార్మిక తదితర సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడామన్నారు. ప్రమాదంలో పది మంది చనిపోగా, ముగ్గురు బయట పడినట్లు తెలిపారు. ఫోరెన్సిక్ రిపోర్టు వచ్చిన తర్వాత ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలిసే అవకాశం ఉందన్నారు. అన్ని వివరాలతో కూడిన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

డి.పోలవరంలో యూరియా కష్టాలు


డి.పోలవరం రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

తుని రూరల్: మండలంలోని డి.పోలవరంలో రైతులు యూరియా కష్టాలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం సక్రమంగా సరఫరా చేయకపోవడంతో గత్యంతరం లేక తమ పంటల సంరక్షణకు అదనపు ధర చెల్లించి, కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన పంటలు 2,200 ఎకరాల్లో సాగవుతున్నాయి. వ్యవసాయ శాఖ సకాలంలో యూరియా అందించలేదు. ఇటీవల డిమాండ్‌కు అనుగుణంగా రైతు సేవా కేంద్రం ద్వారా విక్రయిస్తున్నారు. రైతులను గుర్తించి యూరియా విక్రయించాల్సి ఉండగా, మొదట్లో ఆధార్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ యూరియా ఇచ్చారు. ఈ విధానంపై రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బయోమెట్రిక్‌తో ఒక్కొక్కరికి ఒక బస్తా చొప్పున ఇస్తున్నారు. గ్రామానికి యూరియా వచ్చిందని తెలిస్తే రైతులందరూ ఒక్కసారిగా ఎగబడుతున్నారు. అధికార పార్టీ నాయకులకు అడిగినన్ని ఇస్తుండగా, ఎన్ని ఎకరాలున్నా తమకు ఒమ్మ బస్తా మాత్రమే ఇస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో, ఖరీఫ్‌లో యూరియా అవసరాలు తీర్చుకునేందుకు బ్లాక్‌లో అదనంగా చెల్లించాల్సి వస్తోందని, రూ.270 బస్తాకు బ్లాక్‌లో రూ.450 నుంచి రూ.500 చెల్లిస్తున్నామని వాపోతున్నారు. అధికార పార్టీ నాయకులు తీసుకువెళ్లిన యూరియా బస్తాలనే అదనపు ధరకు విక్రయిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. పంచాయతీలో పలుకుబడి కలిగిన నాయకుడి సూచనలతో అక్రమార్కులకు అడిగినన్ని బస్తాలు ఇస్తుండటంతో సాగుదారులు యూరియా కోసం అవస్థలు పడుతున్నారు. ఈ అక్రమాలను అరికట్టి, సాగు భూమి ఆధారంగా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి అశోక్ కుమార్‌ను వివరణ కోరగా, డిమాండ్‌కు అనుగుణంగా యూరియా రప్పిస్తున్నామని, ఇప్పటి వరకూ 80 టన్నులు అందుబాటులో ఉంచామని చెప్పారు. సిఫారసులతో ఎవ్వరికీ అదనంగా యూరియా ఇవ్వలేదని, పారదర్శకంగానే రైతులందరికీ యూరియా అందిస్తున్నామని అన్నారు.

విశ్వశాంతిని కాంక్షిస్తూ శాంతి కల్యాణం


పవిత్రోత్సవాల్లో భాగంగా శాంతి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి సన్నిధిలో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన పవిత్రోత్సవాలు శుక్రవారంతో సంపూర్ణమయ్యాయి. మూడో రోజు స్వామివారికి, ఉభయ దేవేరులకు అలంకరించిన పవిత్రాలను తీసుకు వచ్చి చక్ర పెరుమాళ్లకు సమర్పించారు. చతుస్థానార్చనలతో ఉత్సవాలను ప్రారంభించి శ్రీపుష్పయాగంతో ముగించారు. 108 కలశాలతో స్వామి, అమ్మవార్లకు శత కలశ స్నపన తిరు మంజన సేవ ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజాదికాల్లో పాల్గొన్నారు. అనంతరం లోక కల్యాణం కోరుతూ శ్రీవారి శాంతి కల్యాణం కనుల పండువగా జరిపించారు. శ్రీపుష్ప యాగం, మహాదాశీర్వచనం, తీర్థ ప్రసాద గోష్ఠి, ఋత్విక్ సన్మానంతో ఉత్సవాలు ముగిశాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో గుడివాడకు చెందిన త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారి శిష్య బృందం చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అన్నవరం: ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అన్నవరం పోలీసుల వివరాల ప్రకారం.. చేపల కోసం ఒడిశాలోని రాయగడ నుంచి కోనసీమ జిల్లా తాళ్లరేవు వెళ్తున్న బొలెరో వాహనం శుక్రవారం తెల్లవారు జామున అన్నవరం రహదారిపై సత్యదేవుని నమూనా ఆలయం వద్ద ఆగిన లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం క్లీనర్ కార్తీక్ (19) అక్కడికక్కడే మృతి చెందాడు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పెంపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): డిసెంబర్ 7న జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు పొందవచ్చన్నారు. దరఖాస్తు గడువును ఈ నెల 25 వరకూ పొడిగించారన్నారు. 27వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని, తర్వాత గడువు పొడిగింపు ఉండదని స్పష్టం చేశారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

ఒకరి మృతి, మరొకరికి గాయాలు


పోతవరం శివారులో ప్రమాద ఘటనా ప్రాంతం

నల్లజర్ల: పోతవరం శివారులో శుక్రవారం ఉదయం ఓ బైక్‌ను ట్రక్కు ఆటో ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న బల్వేంద్రసింగ్ (28) అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బల్వేంద్రసింగ్ ఆరు నెలల క్రితం కొయ్యలగూడెం మండలం కనకాద్రిగూడెంలో మారుతి కోళ్లఫారంలో పనికి చేరాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం సెలవు కావడంతో బైక్‌పై కూరగాయలు తేవడానికి పోతవరం వెళ్తుండగా నల్లజర్ల నుంచి కొయ్యలగూడెం వెళ్తున్న ట్రక్కు ఆటో ఢీకొంది. ఏఎస్ఐ శోభనాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపై కూలిన భారీ వృక్షం


వాకాడ సమీపంలో రోడ్డుపై పడిపోయిన భారీ వృక్షం


నిలిచిపోయిన వాహనాలు

స్తంభించిన ట్రాఫిక్

కరప: కాకినాడ – రామచంద్రపురం ప్రధాన రహదారిలో కరప మండలం వాకాడ బస్టాప్ సమీపంలో శుక్రవారం ఉదయం భారీ వృక్షం రోడ్డుపై నేల కూలింది. దీంతో ట్రాఫిక్ మూడు గంటల పాటు స్తంభించింది. వాతావరణం మారి, ఈదురు గాలులు వీస్తుండటంతో శుక్రవారం ఉదయం 7.30 గంటల సమయంలో భారీ వృక్షం కూలిపోయి, రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఉదయం పనులకు వెళ్లే కూలీలు, కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, కాకినాడ నగరానికి వివిధ పనుల నిమిత్తం వెళ్లే వారితో ఈ రహదారి రద్దీగా ఉంటుంది. రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోవడంతో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కరప పోలీసులు, అధికారులు స్పందించి రోడ్డుపై పడిపోయిన వృక్షాన్ని మూడు గంటల్లో పక్కకు తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

వైఎస్సార్ సీపీ కమిటీల్లో పలువురికి పదవులు



కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురు నాయకులను పార్టీ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఈ వివరాలు తెలియజేసింది.

❖ ఎస్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా చెరుకూరి మృత్యుంజయరాజు, సింగం లోకేష్; ప్రధాన కార్యదర్శిగా తడాల అప్పారావుదొర; కార్యదర్శులుగా నెర్వాడ రాజుబాబు, గుమ్మిడి పొట్టియ్య, తుంపాటి సత్తిబాబు; కార్యవర్గ సభ్యులుగా సింగం వీరబాబు, కనుసు సూరిబాబుదొర, కొల్లపు పుష్పకుమారి, నందా చిన్నాబ్బాయి, దుర్గరాజు నారాయణలను నియమించారు.

❖ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శులుగా లాలం శ్రీనివాస్, శెట్టి సోమరాజు, కీర్తి వివేక్; కార్యదర్శులుగా చిక్కాల వెంకట సాయి రామ్, రెడ్డి భాను ప్రతాప్, వెలుగుల ఏసుబాబు; కార్యవర్గ సభ్యులుగా సుంకర శివరామకృష్ణ, నేలపర్తి వంశీ, కాపావరపు ఈశ్వర ప్రసాద్, నంది జ్యోతిరాజా, గొట్టుపల్లి వంశీ, పోలమతి శాంతి భరత్ నియమితులయ్యారు.

❖ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శులుగా కనికెళ్ల ఫిలిప్, యర్రంశెట్టి మీకా, చట్టాల సుదర్శనమ్ శామ్యూల్; కార్యదర్శులుగా బండి దానియల్, అంబటి అబ్రహం; కార్యవర్గ సభ్యులుగా దడాల యాకూబ్, గంపల బాబు, సజ్జా జాన్ ప్రసన్న కుమార్, అడపా త్రిమూర్తులును నియమించారు.

❖ మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా షేక్ మహబూబ్ సుభానీ; ప్రధాన కార్యదర్శులుగా ఎస్‌కే పోరా సాహెబ్, షేక్ మహబూబ్ సుభానీ, షేక్ రబ్బానీ, సయ్యద్ ఖాజా నజీమ్ మహమ్మద్; కార్యదర్శులుగా ఎస్‌కే ఖాదర్ బాషా, ఎస్‌కే సలీమ్, షేక్ ఇస్మాయిల్, షేక్ రజుద్దీన్, ఎండీ కరీముల్లా, ఎండీ కరీముద్దీన్, ఎస్‌కే రఫీ, ఎండీ మహబూబ్ షరీఫ్; కార్యవర్గ సభ్యులుగా ఆలీ సాహెబ్, ఎస్‌కే ఇమామ్ సాహెబ్, ఎస్‌కే అబ్దుల్ ఘనీ, ఎస్‌కే వల్లీఖాన్, షేక్ లంకా, అబ్దుల్ బాషా, సయ్యద్ మదీనా బాషా, షేక్ ఆమీన్ సాహెబ్‌లను ఎంపిక చేశారు.

❖ పంచాయతీరాజ్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా అడపా మురళి; ప్రధాన కార్యదర్శులుగా బడ్డి నూకరాజు, గానుగుల అప్పలరాజు, కాయల వెంకటేశ్వరరావు; కార్యదర్శులుగా పదిలం బాబూరావు, కునిశెట్టి మాణిక్యం, బత్తుల వెంకట రామకృష్ణ; కార్యవర్గ సభ్యులుగా రెడ్డి స్వామినాయుడు, దూలం బాబూరావు, దేవర రమేష్, కొండపల్లి వెంకటేశ్వరరావు, పోతూరి వీర్రాజు, బచ్చా శివకృష్ణలను నియమించారు.

❖ ఆర్‌టీఐ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శులుగా నున్నం రాంబాబు, లింగంపల్లి బీకే శివకుమార్, పెద్దిరెడ్ల సురేష్; కార్యదర్శులుగా అల్లాడి గోపాల మణికంఠ, ఏఎస్ఎన్ మూర్తి, కటకం ఈశ్వరరావు; కార్యవర్గ సభ్యులుగా గంధం నాగ వీరబాబు, మైలవరపు శ్రీనివాసరావు, కాపారపు రాజు, అరిగెల తాతయ్యదొర, ఎస్.రాజేష్, కాలిన గంగాధర్ నియమితులయ్యారు.

❖ అంగన్‌వాడీ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శుగా వి.నాగమణి, కంచుకోట లక్ష్మి; కార్యదర్శులుగా పి.కుమారి, సోము వెంకట దుర్గా అచ్యుతాంబ; కార్యవర్గ సభ్యులుగా దిమిలి మేరీ, ఎస్.దయామణి, మిరియాల పద్మావతి, అచ్చింత అశ్వినిలను ఎంపిక చేశారు.

❖ కల్చరల్ వింగ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొప్పన సుబ్బారావు; ప్రధాన కార్యదర్శులుగా సీహెచ్ నూకరాజు, పురంశెట్టి నరేంద్ర; కార్యదర్శులుగా చవ్వాకుల రమణ, కొడమాటి కుమార్‌బాబు, నీలపల్లి అప్పారావు; కార్యవర్గ సభ్యులుగా అల్లు కాశీనాయుడు, చిల్లపల్లి సత్యనారాయణ, ముప్పిడి కృపారావు, గొందేసి సత్యానందం, పందిరి బుజ్జిబాబు, మండేటి డేవిడ్‌రాజు నియమితులయ్యారు.

❖ దివ్యాంగుల విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా యాదగిరి మనోహర్; ప్రధాన కార్యదర్శిగా వెల్లపు సూరిబాబు; కార్యదర్శులుగా రౌతు దుర్గా ప్రసాద్, బదిరెడ్డి సత్యనారాయణ; కార్యవర్గ సభ్యులుగా అంబటి దుర్గాప్రసాద్, చింతకాయల రాజు, కోలా శ్రీను, శివుడు త్రిమూర్తులు ఎంపికయ్యారు.

❖ గ్రీవెన్స్ సెల్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కస్నూరి శ్రీనివాసరావు; ప్రధాన కార్యదర్శులుగా అడబాల సూర్యనారాయణ, సుర్ల సత్తిబాబు; కార్యదర్శులుగా జీవీవీ సూర్యనారాయణ, అల్లాడ సూరిబాబు, గాబు వీర వెంకట సత్యనారాయణ; కార్యవర్గ సభ్యులుగా అలమండ సుబ్రహ్మణ్యం, కాకర చిన్నోడు, కోరుకొండ వెంకట రామకృష్ణ, వెన్నా శివకుమార్, చిటికెల శ్రీరామ పాత్రుడులను నియమించారు.

❖ లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా బత్తుల రవికుమార్; ప్రధాన కార్యదర్శులుగా పోతుల జోగేష్, పిట్టా సుగుణరావు; కార్యదర్శులుగా అడపా సురేష్, పోతుల జోగేశ్వరరావు; కార్యవర్గ సభ్యులుగా పాకలపాటి రవిధర్మ చక్రవర్తి, చోడిశెట్టి బాలాజీరావు, రామిశెట్టి సత్యనారాయణ, సింహాద్రి సూరిబాబు నియమితులయ్యారు.

❖ పబ్లిసిటీ వింగ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా అరుమిల్లి ఏసుబాబు; ప్రధాన కార్యదర్శులుగా ఏనుగు శ్రీను, రావుల స్వామి; కార్యదర్శులుగా పెద్దిర్శి రమేష్, పక్కుర్తి జయబాబు, దొడ్డా వెంకటేశ్వరరావు; కార్యవర్గ సభ్యులుగా యడ్ల వెంకటరమణ, రావి శ్రీను, ఈగల గంగా వెంకట సతీష్, నెమలికంటి కుమారి, బొడ్డు ఆంజనేయ చౌదరి, మదుకూరి రామకృష్ణ ఎంపికయ్యారు.

❖ సోషల్ మీడియా వింగ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా జల్లి ప్రవీణ్‌కుమార్; ప్రధాన కార్యదర్శులుగా నెమలి శ్రీను, గంటా భాస్కర్; కార్యదర్శులుగా యేలగుండి జార్జికిరణ్, మోతుకూరి ధర్మరాజు, తుమ్మల గంగాధర్; కార్యవర్గ సభ్యులుగా సీహెచ్ గణేష్, కాలా వినయ్, గొర్రెల రాంబాబు, గుమ్ములూరి ఎస్ఆర్ సురేష్ పద్మరాజు, నక్కా పాండురంగ, సిమిల్లి బాలును నియమించారు.

❖ వీవర్స్ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శులుగా దొడ్డి బాబ్జీ, నీలి అబ్బులు, యర్రా వెంకటేశ్వరరావు; కార్యదర్శులుగా జక్కా వరహాలుబాబు, వానపల్లి వెంకటరమణ, చుక్కల నాని, కాడా సూర్య సింగారావు; కార్యవర్గ సభ్యులుగా మొండి బాపనయ్య, బలపాటి సోమరాజు, శీరం దొంగబాబు, కొప్పుల చినబాబు, యర్రా శ్రీనివాసు, అల్లాడ పాపారావు నియమితులయ్యారు.

❖ వైఎస్సార్ టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నరాలశెట్టి నరసయ్య; ప్రధాన కార్యదర్శులుగా బర్రే అప్పారావు, శెట్టి సత్తిబాబు, జలిమి రాము; కార్యదర్శులుగా కలిగట్ల నానాజీ, పులి మధు, అక్కిరెడ్డి నాగార్జున; కార్యవర్గ సభ్యులుగా తోటాడ రాజు, అన్నంరెడ్డి రాజేష్, పిల్లా చిన్నా, బంగారు రాంబాబు, కండెల్లి రమేష్, గొంతిన రామారావులను ఎంపిక చేశారు.